సాక్షి శ్రీకాకుళం

బుధవారం । 25 । జనవరి । 2023



ఎందుకి'లా..?'

జీఆర్‌ఏయూలోని లా కాలేజీలో ప్రవేశాలు నిలిపివేశారు. అనుబంధ కాలేజీకి మాత్రం అనుమతి ఇచ్చారు. - 8లో



1న శాలిహుండం గిరియాత్ర

శాలిహుండం గిరియాత్ర ఫిబ్రవరి 1న జరగనుంది. ఉత్సవ ఏర్పాట్లు జరుగుతున్నాయి. - 8లో

27న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

అరసవల్లి: జిల్లా పరిషత్ స్థాయీ సంఘ సమావేశాలను జెడ్పీ సమావేశ మందిరంలో ఈనెల 27న నిర్వహిస్తున్నట్లుగా జెడ్పీ సీఈఓ ఆర్.వెంకట్రామన్ తెలియజేశారు. ఉదయం 10 గంటలకు 6వ స్థాయీ, 11 గంటలకు 3వ, 12 గంటలకు 5వ, మధ్యాహ్నం 2 గంటలకు 2వ, 3 గంటలకు 4వ, 4 గంటలకు 7వ, 5 గంటలకు 1వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని సభ్యులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు.

న్యూస్‌రీల్

నిరుద్యోగ పోరాట సమితి ఆధ్వర్యంలో మోడల్ పరీక్షలు

టెక్కలి: ఏపీ నిరుద్యోగ పోరాట సమితి ఆధ్వర్యంలో బుధవారం జేఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ తదితర మోడల్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు టి.సూర్యం తెలిపారు. ఈ మేరకు మంగళవారం టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు చేతుల మీదుగా నమూనా పేపర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జేఈఈ మెయిన్స్, నీట్, ఎంసెట్ తదితర మోడల్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇలాంటి పరీక్షల వలన సమయస్ఫూర్తి కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డి.విష్ణుమూర్తి, జయమన్మథరావు పాల్గొన్నారు.

సజావుగా జేఈఈ మెయిన్స్



శివానీ కేంద్రంలో విద్యార్థిని తనిఖీచేస్తూ..

ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలో జేఈఈ మెయిన్స్ ఆన్‌లైన్ పరీక్షలు చిలకపాలేంలోని శ్రీ శివానీ, ఎచ్చెర్లలోని శ్రీ వెంకటేశ్వర పరీక్ష కేంద్రాల్లో మంగళవారం ప్రారంభమయ్యాయి. రెండు షిఫ్టుల్లో పరీక్షలు జరిగాయి. చిలకపాలేంలోని శ్రీ శివానీ ఇంజినీరింగ్ కాలేజీలో మొదటి షిఫ్ట్‌లో 174 కి 172, రెండో షిఫ్ట్‌లో 174కి 172 మంది హాజరయ్యారు. ఎచ్చెర్ల శ్రీ వెంకటేశ్వర ఇంజినీరింగ్ కళాశాలలో మొదటి షిఫ్ట్‌లో 99 కి 98, రెండో షిఫ్ట్‌లో 99కి 98 మంది హాజరయ్యారు. రెండు పరీక్ష కేంద్రాల్లో 546 మందికి 540 మంది హాజరు కాగా, ఆరుగురు గైర్హాజరయ్యారు. అధికారులు నిరంతరం పర్యవేక్షించారు.

సీతాపురం విద్యార్థులు.. పలాసలో ప్రత్యక్షం

టెక్కలి రూరల్: టెక్కలి మండలం సీతాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మంగళవారం తమ ఇంటిలో బడికి వెళ్తామని చెప్పి పలాస రైల్వేస్టేషన్‌లో కనిపించారు. వీరిని రైల్వే చైల్డ్‌లైన్ ప్రతినిధులు గుర్తించి ఇంటికి చేర్చారు. ఈ ఇద్దరు అన్నదమ్ములు రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా కనిపించడంతో చైల్డ్‌లైన్ ప్రతినిధులకు అనుమానం వచ్చి ప్రశ్నించారు. తాము పలాస చూసేందుకు సైకిల్‌పై వచ్చామని, రైల్వే స్టేషన్ కూడా అందుకే వచ్చామని చెప్పారు. దీంతో అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వారు స్టేషన్‌కు రావడంతో పిల్లలను వారికి అప్పగించారు. దీనిపై పాఠశాల హెచ్ఎం సత్తారు వేణికుమారిని అడగ్గా ఆ విద్యార్థులు గత కొన్ని రోజులుగా పాఠశాలకు రావడం లేదని తెలిపారు.

రేపు జిల్లాస్థాయి జూడో ఎంపికలు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి సబ్‌జూనియర్స్, క్యాడెట్ బాలబాలికల ఎంపికలు ఈ నెల 26వ తేదీన జరగనున్నాయని శ్రీకాకుళం జిల్లా జూడో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పులఖండం సూర్య ప్రకాష్, ఎంవీ రమణ తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి పొందూరు మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తాడివలస వేదికగా ఈ ఎంపికలు జరుగుతాయని చెప్పారు. సబ్‌జూనియర్స్‌కు హాజరయ్యే బాలబాలికలు 2005 జనవరి 1 నుంచి 2007 డిసెంబర్ 31 మధ్య జన్మించి ఉండాలని, కేడెట్‌కు హాజరయ్యే బాలబాలికలు 2008 జనవరి 1 నుంచి 2010 డిసెంబర్ 31 మధ్య జన్మించి ఉండాలని స్పష్టం చేశారు. పోటీలకు హాజరయ్యే బాలబాలికలు తమ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, 4 పాస్ ఫొటోలు తమ వెంట తీసుకురావాలని కోరారు. తాడివలసలో ఎంపికైన క్రీడాకారులు ఫిబ్రవరి 3 నుంచి 5వ వరకు కర్నూలు జిల్లా నందికొట్కూరు వేదికగా జరిగే ఏపీ రాష్ట్ర స్థాయి జూడో చాంపియన్‌షిప్ పోటీలకు అర్హులవుతారని సూర్యప్రకాష్, ఎంవీ రమణ పేర్కొన్నారు. జిల్లా జూడో అసోసియేషన్ కార్య నిర్వాహక కార్యదర్శి, తాడివలస పీడీ పైడి సునీత ఆధ్వర్యంలో ఈ ఎంపికలు జరుగుతాయని, మరిన్ని వివరాలకు శాప్ జూడో కోచ్ పి.ఎస్. మణికుమార్ (సెల్:9704934926)ను సంప్రదించాలని కోరారు.

పక్కాగా మిడ్ సెమిస్టర్ పరీక్షలు

ఎచ్చెర్ల క్యాంపస్: వర్సిటీలో మిడ్ సెమిస్టర్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు అన్నారు. వర్సిటీలో నిర్వహిస్తున్న మిడ్ సెమిస్టర్ పరీక్షలను ఆయన మంగళవారం పరిశీలించారు. సోమవారం ప్రారంభమైన ఈ పరీక్షలు బుధవారంతో ముగియనున్నాయి. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సీహెచ్ఏ రాజేంద్ర ప్రసాద్‌తో కలిసి ఆయన పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. షెడ్యూల్ మేరకు పారదర్శకంగా జరగాలన్నారు.



ఉద్దానం తోటలో.. విదేశీ పంట

ఉద్దానం మార్కెట్‌కు కొత్త సరుకు వచ్చింది. పేరు బ్రకోలీ. చూసేందుకు అచ్చం మన క్యాబేజీ పువ్వులాగానే ఉంటుంది. కానీ తింటే మాత్రం పోషకాలు అమోఘం. మన దగ్గర ఇప్పుడిప్పుడే డిమాండ్ కనిపిస్తోంది గానీ.. వేరే దేశాల్లో అయితే ఎగబడి తింటారు. అందుకే మన ఉద్దానం రైతులు భవిష్యత్‌ను పసిగట్టి ఇప్పుడు తమ **పొలాల్లో బ్రకోలీని పండించడం మొదలుపెట్టారు.** ప్రస్తుతానికి దిగుబడి బాగానే ఉంది. రాబడి **కూడా** ఫర్వాలేదు. బ్రకోలీపై అవగాహన పెరిగితే **మాత్రం** రైతుల పంట పండినట్టే.



- బ్రకోలీ అనే విదేశీ పంటను పండిస్తున్న వైనం
- పలాస మార్కెట్‌లోనే విక్రయాలు
- ప్రోత్సహిస్తే రైతులకు లాభదాయకమే

కాశీబుగ్గ: బ్రకోలీ.. కాలీ ఫ్లవర్ జాతికి చెందిన **పంట.** దండిగా పోషక గుణాలు కలిగిన ఈ పదార్థాన్ని విదేశాల్లో విరివిగా వంటల్లో వాడుతుంటారు. ఉద్దానంలో ఈ పంట పండిస్తూ కొందరు రైతులు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. పలాస మార్కెట్‌లోనే వీటిని విక్రయిస్తున్నారు కూడా. పలాస మండలం బొడ్డపాడు గ్రామంలో ఈ పంటను పండిస్తున్నారు.

ఏమిటీ బ్రకోలీ..?

విదేశాలలో అతిశీతల ప్రాంతంలో పండే అత్యధిక పోషకాలు ఉన్న పంట బ్రకోలీ. మన ప్రాంతంలో దీని వాడకం చాలా తక్కువ. కానీ పోషకాలపై కాస్త అవగాహన ఉన్న వారెవరైనా బ్రకోలీ కనిపిస్తే కొనక మానరు. సామాజిక మాధ్యమాల ద్వారా స్థానికంగానూ దీని విలువను చాలా మంది తెలుసుకుంటున్నారు. ఇప్పుడు శ్రీకాకుళం జిల్లా ఉద్దానంలోనూ ఈ పంట దొరుకుతోంది. వాతావరణం బాగా చల్లగా ఉండే ఉద్దానంలో మునగ, జీడి మామిడి, పనస, మామిడి, కొబ్బరి, బొప్పాయి, జీనుగులు, కందులు, దుంపజాతులు, దబ్బ, నిమ్మ, అరటికాయలు, చింతకాయలు వంటివి ఎక్కువగా సాగు చేస్తారు. ఇప్పుడు ఆ జాబితాలోకి బ్రకోలీ వచ్చి చేరింది.

శీతాకాలంలో ఉత్తరభారతదేశంలో సైతం ఇప్పుడు ఈ పంటను విరివిగా పండిస్తున్నప్పటికీ దక్షిణ భారతదేశంలో వేడికి ఈ పంటను అంతగా పండించడంలేదు. ఉద్దానంలో వాతావరణం అనుకూలంగా ఉండటంతో నవంబరులో పంటను వేసి సరిగ్గా మూడు మాసాలకు పంటను పొందుతు**న్నారు. వారానికి రెండు మూడు సార్లు నీటినదు**పాయం కల్పించే ఈ పంటకు చల్లదనమే ప్రధానం. అందుకు పల్లపు, కొండప్రాంతాలు అనుకూలం కాకపోవడంతో ఉద్దాన ప్రాంతంలో ఇది విజయవంతమవుతోంది. అయితే విక్రయాల్లో కాస్త ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఏటికేటా పంట విస్తీర్ణం పెంచుకుంటూ పోతున్నామని రైతులు చెబుతున్నారు.

పలాసలో అమ్మకాలు..

బొడ్డపాడు, కాలనీ, మామిడిపల్లి గ్రామాలకు చెందిన మూడు కుటుంబాలు మూడెకరాల్లో ప్రయోగాత్మకంగా పెంచుతున్నారు. రోజు వారీగా పండిన పంటను సేకరించి వాటిని ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న పలాస–కాశీబుగ్గ మార్కెట్‌కు తీసుకెళ్తున్నారు. కిలో బ్రకోలి రూ.50కు విక్రయిస్తున్నారు. మిగిలిన పంటను దళారులు, దుకాణదారులకు అందిస్తున్నారు. వారు సుమారు రూ.100కు అమ్ముకుంటున్నారు.

“ బెంగళూరు నుంచి విత్తనాలు తెప్పించాం



ఉద్దాన ప్రాంతంలో ఉన్న పలాస మండలం బొడ్డపాడు గ్రామం మాది. బెంగళూరు నుంచి విత్తనాల ప్యాకెట్లు తెప్పించి వాటిని మొదటి ఏడాది పండించాను. అనంతరం మూడేళ్లుగా ఇక్కడ మూడు కుటుంబాలు బ్రకోలీని పండిస్తున్నాం. మేమైతే ప్రయోగంగానే పండించాం. నష్టం వచ్చినా ఫర్వాలేదని డేరింగ్ చేసి పండిస్తే ఫలితం వచ్చింది. ప్రస్తుతం దళారులకు రూ.50లకు కేజీ ఇస్తున్నాం. మార్కెట్‌లో మంచి విలువ ఉంది. మా ప్రాంతం వాటి పెరగడానికి సరైన నేలలతో పాటు వాతావరణం కలిగి ఉంటమే పంట దిగుబడికి కారణం. ఈ ప్రాంతంలో మేమే తొలిసారి పండించడంతో మాకు చాలా ఆనందంగా ఉంది.

– సరోజ వర్మ, యువ రైతు, బొడ్డపాడు గ్రామం, పలాస మండలం

బోలెడు ప్రయోజనాలు..

- క్యాన్సర్ వ్యాధిని పోగొట్టే గుణం బ్రకోలి ప్రత్యేకం.
- సలాడ్, సూప్స్, కూరగా వండవచ్చు.
- కప్పు బ్రకోలీలో 30 కేలరీస్ ఉంటాయి.
- విటమిన్ సి, విటమిన్ ఎ, విటమిన్ ఇ ఉంటాయి.
- కాల్షియం, ఫోలెట్, బీటాకెరోటిన్, దీనిలో పుష్కలం.
- పళ్లు, ఎముకలు, శరీర రక్షణకు ఉపయోగపడతాయి.
- బీపీ, మధుమేహం నియంత్రణలో ఉండడానికి సాయపడుతుంది.
- మెగ్నీషియం, పోటాషియం నాడీ వ్యవస్థపై పనిచేస్తాయి.
- గ్లూకోరెఫినాన్ పదార్థం శరీరం ముడతలు పడకుండా ఉంటుంది. గుండె జబ్బులు తగ్గించుకోవచ్చు.
- రోజూ తింటే చెడు కొలెస్ట్రాల్ పోయి మంచి కొలెస్ట్రాల్ పెరుగుతాయని నిపుణులు చెబుతున్నారు..



● భక్తజన శంబరం

మక్కువ: మంగళ వాయిద్యాలు.. భక్తుల జయ జయ ధ్వానాలు.. సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శంబర పోలమాంబ సిరిమానోత్సవం మంగళవారం అంగరంగా వైభవంగా సాగింది. సిరిమానోత్సవాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులతో శంబర గ్రామం భక్త సంద్రంగా మారింది. సిరిమాను పూజారి రూపంలో అమ్మవారు తరలివచ్చిన వేళ భక్త జనం పులకించింది. అమ్మవారికి మనసారా ప్రార్థనలు చేసింది. మొక్కుబడులు చెల్లించింది. అమ్మవారి ఆశీస్సులు అందుకుంది. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఒడిశా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ఏ దారి చూసినా శంబర వైపే సాగాయి. భక్తులు గోముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఆరాధ్య దైవం పోలమాంబను దర్శించుకున్నారు. మధ్యాహ్నం 3.49 గంటలకు పూజారి జన్నిపేకాపు రామారావు సిరిమానును అధిరోహించారు.







శంబరలో సిరిమానోత్సవ సందడి

రక్తదానం చేద్దాం

- జిల్లా ప్రజలకు కలెక్టర్, ఎస్పీ పిలుపు
- శ్రీకాకుళాన్ని ప్రమాదరహిత జిల్లాగా తీర్చిదిద్దాలని సూచన



రక్తదానం చేస్తున్న ఎస్పీ జీఆర్ రాధిక

శ్రీకాకుళం క్రైమ్, శ్రీకాకుళం రూరల్ : ప్రజలు రక్తదానానికి ముందుకు రావాలని, అలాగే రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి కృషి చేయాలని కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జీఆర్ రాధిక కోరారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా ఉప రవాణా అధికారి సీహెచ్ శ్రీదేవి అధ్యక్షతన 34వ రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రహదారి భద్రతపై ప్రతి పోలీసు అధికారితో పాటు ప్రజల్లో కూడా అవగాహన ఉండాలని కోరారు. డ్రైవర్లు విధిగా కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. వాహనంపై ఫోన్ మాట్లాడుతూ వెళ్లడం, హెల్మెట్ ధరించకపోవడం, కార్లలో సీటుబెల్టు పెట్టుకోకపోవడం వంటివి ప్రమాదాల బారిన పడటానికి కారణాలని నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. అనంతరం నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఎస్పీ జీఆర్ రాధిక పాల్గొని రక్తదానం చేశారు. కలెక్టర్ చేతుల మీదుగా ప్రశంసా పత్రం కూడా అందుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వాహన చోదకులకు సరైన అవగాహన లేక జిల్లాలో ప్రమాదాలు అధికమవుతున్నాయని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపడం మంచిది కాదన్నారు. ట్రాఫిక్ నియమాలపై లఘు చిత్రాలు రూపొందిస్తున్నామని పేర్కొన్నారు. అన్ని విభాగాలు సమన్వయంతో కృషి చేయడం ద్వారా రహదారి ప్రమాదాలు నియంత్రించి శ్రీకాకుళం జిల్లాను ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు పాటుపడాలని ఎస్పీ కోరారు. కార్యక్రమంలో జాతీయ రహదారుల డిప్యూటీ మేనేజర్ సతీష్, డీఎస్పీ మహేంద్ర మాతే, జిల్లా రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ పి.జగన్మోహనరావు, వివిధ శాఖల అధికారులు, ఆర్టీసీ అధికారులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



● సేవ్ గర్ల్

జాతీయ బాలికా దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించారు. కంచిలి మండలంలోని కత్తివరం ప్రాథమికోన్నత పాఠశాలలో ఓ విద్యార్థిని ఇలా సేవ్ గర్ల్ అంటూ చేసిన ప్రదర్శన ఆలోచింపజేసింది. ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

– కంచిలి

లోకేష్ మనుగడ కోసమే పాదయాత్ర

- మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు



మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: చంద్రబాబు కుటుంబం తలకిందులైనా జన్మలో అధికారంలోకి రాలేదని, లోకేష్ కేవలం పార్టీలో తన మనుగడ కోసమే పాదయాత్ర చేస్తాడని రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమలశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు గడపగడపకూ వైఎస్సార్ సీపీ నిర్వహించామని, ఆపై పార్టీ అధినేత వైఎస్ జగన్ పాదయాత్ర చేశారని, ఆ సమయంలో ప్రజా సమస్యలపై అధ్యయనం చేసి అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు పెట్టారని అన్నారు. ఇప్పుడు కూడా జనంలో ఉండేందుకే గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్నామని తెలిపారు. మేనిఫెస్టోని పవిత్ర గ్రంథంగా భావించి పాలిస్తున్న గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని అన్నారు. అర్హులందరికీ సంక్షేమాలు అందేలా చూసుకుంటున్నారని తెలిపారు. ఇలాంటి కార్యక్రమానికి పోటీగా టీడీపీ నిర్వహించిన ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని జనం నమ్మలేదని, అందుకే లోకేష్ పాదయాత్ర అంటూ వస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్ జగన్ పథకాలపై విమర్శలు చేసిన బాబు ఇప్పుడు తానూ అదే పథకాలు ఇస్తానని చెప్పుకుంటున్నారని చురకలు అంటించారు. లోకేష్ వంటి వ్యక్తులకు నడక మంచిదని, దానికి అనుమతులు అక్కర్లేదని ఆరోగ్య రక్షణ కోసం నడవడానికి యువగళం అని పేరెందుకు పెట్టుకున్నారని చమత్కరించారు. 'మీ నాన్న రాష్ట్ర యువకులకు చేసిన మోసం ఎవ్వరూ మర్చిపోలేరు' అని అన్నారు. ఎన్నికల ముందు ముఖ్యమంత్రి యువ నేస్తం అని పేరు పెట్టారని రాష్ట్రంలో ఎవ్వరికైనా గుర్తుందా అని ప్రశ్నించారు. నిరుద్యోగ భృతి కూడా ఇవ్వలేదని, అధికారంలో ఉన్నప్పుడు బాబు యువతను మోసం చేశారని మండిపడ్డారు. ప్రజలను జన్మభూమి కమిటీలు పట్టి పీడిస్తున్నప్పుడు, అసెంబ్లీలో మాట్లాడేందుకు అవకాశం లేనప్పుడు, రోజాను ఏడాది పాటు అసెంబ్లీలో అడుగు పెట్టకుండా చేసిన సందర్భంలో వైఎస్ జగన్ పాదయాత్ర చేసి ప్రజల్లోకి వెళ్లారని గుర్తు చేశారు. లోకేష్ మాత్రం అధికార కాంక్షతో పాదయాత్ర బాట పడుతున్నారని విమర్శించారు. ప్రజల కోసం ప్రభుత్వం ఉందని, ఎన్ని వేషాలు వేసినా ఏమీ చేయలేరని అన్నారు.

అరసవల్లిలో సరికొత్త క్యూ కాంప్లెక్స్

అరసవల్లి: అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయంలో తొలి క్యూ కాంప్లెక్స్ ప్రారంభానికి సిద్ధమవుతోంది. ఇంద్రపుష్కరిణి వద్ద గతంలో ఓ దాత నిర్మించిన అసంపూర్తి భవనాన్ని ఇప్పుడు సరికొత్త సౌకర్యాలతో క్యూకాంప్లెక్స్‌గా ఆలయ అధికారులు మార్చేశారు. ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ సూచనల మేరకు సంబంధిత దాత ఆమోదం ప్రకారం ఉచిత దర్శనాలకు వచ్చే భక్తులకు ఈ కాంప్లెక్స్ అందుబాటులోకి రానుంది. సుమారు 1500 మందికి పూర్తి స్థాయిలో రక్షణగా ఉండనున్న ఈ క్యూ కాంప్లెక్స్‌లో పక్కా క్యూలైనింగ్, మరుగుదొడ్లు, విద్యుత్ లైట్లు, ఫ్యాన్లు సౌకర్యాలను కూడా కల్పించారు. మంగళవారం ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, ఇప్పిలి షణ్ముఖశర్మలు కొత్త క్యూకాంప్లెక్స్‌ను పరిశీలించారు. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ కాంప్లెక్స్ తయారవుతోందని, దీన్ని రథసప్తమికి అందుబాటులోకి తెచ్చేలా యుద్ధప్రాతిపదికన పనులు చేయిస్తున్నామని ఈఓ తెలిపారు.



కొత్త క్యూ కాంప్లెక్స్‌ను పరిశీలిస్తున్న ఈఓ హరి సూర్య ప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకర శర్మ

నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు

అరసవల్లి: రథసప్తమి ఉత్సవానికి సంబంధించి అరసవల్లి ప్రాంతంలో ఎక్కడా విద్యుత్ పరంగా అంతరాయం ఉండకుండా చర్యలు చేపడుతున్నామని విద్యుత్ శాఖ ఎస్ఈ ఎల్.దైవప్రసాద్ స్పష్టం చేశారు. మంగళవారం అరసవల్లి ఆలయ పరిసరాల్లో విద్యుత్ సరఫరా.. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లను ఆయన స్వయంగా పరిశీలించారు. ప్రస్తుతానికి అరసవల్లి ఆలయ పరిసరాల్లో మూడు 100 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు, ఒక 63 కేవీ, ఒక 163 కేవీ ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉన్నాయని విద్యుత్ అలంకరణ ఇతరత్రా ఏర్పాట్లు చేసినప్పటికీ లోడ్ సమస్య తలెత్తే పరిస్థితి లేదన్నారు. విద్యుత్ శాఖ నుంచి అవసరమైన మేరకు సేవలందిస్తామని, అలా గే ఉత్సవం రెండు రోజుల పాటు విద్యుత్ సిబ్బందిని అందుబాటులో ఉంచుతామని ఆలయ ఈఓ హరిసూర్యప్రకాష్‌కు తెలియజేశారు. ఈయన వెంట డివిజనల్ ఈఈ బయ్యన్నాయుడు తదితరులు పాల్గొన్నారు.



30న టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ డ్రైవ్

టెక్కలి: ఈ నెల 30న టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కళాశాలలో జేకేసీ, కెరీర్ గైడెన్స్ ఆధ్వర్యంలో ఐసీఐసీఐ బ్యాంకు నేతృత్వంలో ఈ జాబ్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఆమె వెల్లడించారు. డిగ్రీ పూర్తి చేసిన వారితో పాటు ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. జనన ధ్రువీకరణ పత్రంతో పాటు అన్ని సర్టిఫికెట్లతో హాజరు కావాలని కోరారు.

వాసుదేవుని సన్నిధిలో చిన్నజీయర్‌స్వామి

మందస: మందస పట్టణంలోని శ్రీవాసుదేవపెరుమాళ్‌స్వామిని త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్‌స్వామి మంగళవారం సాయంత్రం దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన జీయర్‌స్వామికి సంప్రదాయబద్ధంగా పూలమాలలు, పూర్ణకుంభాలు, జ్యోతులతో అర్చకులు, ఆండాళ్లగోష్టి స్వాగతం పలికి ఆహ్వానించారు. ప్రత్యేక పూజల అనంతరం చిన్నజీయర్‌స్వామి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ పరిసరాలను పరిశీలించారు. స్థితి, గతులను ప్రధాన అర్చకులు గోపినంబాళ్ల దాసుకూర్మాచార్యులను అడిగి తెలుసుకున్నారు. ఫిబ్రవరిలో జరిగే వాసుదేవుని బ్రహ్మోత్సవాలపై చర్చించారు. ఆలయ అభివృద్ధి కమిటీ నాయకులు శానాపతి కిషోర్‌కుమార్, కొర్ల కన్నారావు, ఆర్.ఎస్.ప్రకాశరావు, జామి ఈశ్వర వెంకటవర ప్రసాదరావు, కరతల తిరుపతిరావు, కిల్లంశెట్టి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.



ఆలయ పరిసరాలను పరిశీలిస్తున్న చిన్నజీయర్‌స్వామి

క్లుప్తంగా

పీడీఎస్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న వాహనం, పీడీఎస్ బియ్యంతో ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో విజిలెన్స్ అధికారులు

ఎచ్చెర్ల క్యాంపస్: ముద్దాడ గ్రామం నుంచి బొలేరో వ్యాన్‌లో అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని సోమవారం రాత్రి విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. ఈ మేరకు వాహనాన్ని ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుకున్న బియ్యం 3400 కిలోలు కాగా, రూ.1.20 లక్షలు విలువ ఉంటుందని అంచనా వేశారు. ముద్దాడ సమీపంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా ఈ అక్రమ తరలింపు కంటపడింది. ముప్పిడి సాయి, జామి కూర్మారావు, సింహాద్రి శ్రీరామూర్తిలను నిందితులుగా గుర్తించి కేసు నమోదు చేసి, బియ్యం, వాహనం సీజ్ చేశారు. అనంతరం దర్యాప్తును ఎచ్చెర్ల రెవెన్యూ అధికారులకు అప్పగించారు. దాడిలో విజిలెన్స్ ఎస్‌ఐ అశోక్, సిబ్బంది రామ్మోహన్, ఉమ, అప్పన్న, పౌరసరఫరా శాఖ అధికారి జామవా పాల్గొన్నారు.

'భవన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు కీలకం'



భవన నిర్మాణాలపై సమీక్ష నిర్వహిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు

ఎచ్చెర్ల క్యాంపస్: భవన నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు కీలకమని శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం డైరెక్టర్ ప్రొఫెసర్ పెద్దాడ జగదీశ్వరరావు అన్నారు. ట్రిపుల్ ఐటీలో భవన నిర్మాణాల పరిస్థితిపై ఎస్ఎం పురం క్యాంపస్‌లో మంగళవారం పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న న్యూ అకడమిక్ బ్లాక్ (రూ. 66.07 కోట్లు), ఇంజినీరింగ్ ల్యాబ్ (రూ. 3.06 కోట్లు), డైనింగ్ హాల్ (రూ. 2.80 కోట్లు) పనులపై సమీక్షించారు. న్యూ అకడమిక్ బ్లాక్ 2023 అక్టోబర్, ల్యాబ్, డైనింగ్ హాల్ ఈ ఏడాది ఏప్రిల్‌లోపు కాంట్రాక్టు అగ్రిమెంట్ మేరకు పూర్తికావాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ సకాలంలో బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఇంజినీరింగ్ అధికారులు నిరంతరం పనులు పర్యవేక్షించాలని, నాణ్యతలో రాజీ లేకుండా భవనాల నిర్మాణం జరగాలని చెప్పారు. 2024 నాటికి 6000 మంది విద్యార్థులు వసతి లక్ష్యంగా ఈ భవనాలు పూర్తికావాలని అన్నారు. ఈ సమీక్షలో ఓఎస్‌డీ ప్రొఫెసర్ ఎల్. సుధాకర్‌బాబు, పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ డీఈ వెంకటరెడ్డి, ఏఈ కోదండరాం, ట్రిపుల్ ఐటీ ఏఈ సురేష్ పాల్గొన్నారు.

27న పీసీసీ అధ్యక్షుడి జిల్లా పర్యటన

శ్రీకాకుళం అర్బన్: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు పద్మరాజు ఈనెల 27వ తేదీన శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి తెలిపారు. కాంగ్రెస్ కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేష్ రెడ్డి ఆధ్వర్యంలో డీసీసీ అధ్యక్షులు బొడ్డేపల్లి సత్యవతి అధ్యక్షతన కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర మొదటి దశ కశ్మీర్‌లో ముగుస్తుందన్నారు. దేశంలో రాహుల్ గాంధీ నాయకత్వం బలపరుస్తూ రాష్ట్రంలో ప్రతి ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీ విధి, విధానాలు వివరిస్తామన్నారు. జనవరి 26 నుంచి మార్చి 26 వరకు ప్రతి నియోజకవర్గంలో నిర్వహిస్తామని తెలియజేశారు. అందులో భాగంగానే ఈనెల 27న పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఆధ్వర్యంలో శ్రీకాకుళంలో కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు. అనంతరం రాహుల్ గాంధీ పాదయాత్ర ముగింపు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	54,930-00
బంగారం(22కి. 10గ్రా.)	50,350-00
వెండి (కిలో)	74,500-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 547.00
విజయనగరం	రూ. 551.00
శ్రీకాకుళం	రూ. 551.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

ఎందుకిలా..?

- వర్సిటీ న్యాయ విద్యలో నిలిచిపోయిన మొదటి విడత ప్రవేశాలు
- అఫిలియేషన్ కళాశాలలో మాత్రం ప్రవేశాల నిర్వహణ



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న జ్యోతీరావు పూలే న్యాయ కళాశాలలో మొదటి ఏడాది ప్రవేశాలు నిలిపివేశారు. డిసెంబర్‌లో మొదటి విడత, జనవరి 20, 21 తేదీల్లో ఏపీ లాసెట్-2022 కౌన్సెలింగ్ నిర్వహించారు. రెండు కౌన్సెలింగ్‌ల్లోనూ ప్రవేశాల నిర్వహణకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి అనుమతి ఇవ్వలేదు. ఆంధ్రా విశ్వవిద్యాలయం పోస్టు గ్రాడ్యుయేషన్ కేంద్రంగా ఉన్నప్పటి నుంచి ఇక్కడ లా కోర్సులు నిర్వహిస్తున్నారు. ఈ కోర్సులు నిర్వహించాలంటే బార్ కౌన్సెల్ ఆఫ్ ఇండియా గుర్తింపు ఉండాలి. 2008లో వర్సిటీ ఏర్పాటు తర్వాత కౌన్సిల్‌కు దరఖాస్తు చేసుకుంటే.. 2009లో బీసీఐ బృందం కాలేజీని పరిశీలించింది. ప్రత్యేక కళాశాల, ప్రిన్సిపాల్, రెగ్యులర్ బోధన సిబ్బంది, ప్రత్యేక లైబ్రరీ వంటి సౌకర్యాలు ఉండాలని కమిటీ గుర్తింపు ఇవ్వలేదు. అయితే ఇది ప్రభుత్వ కాలేజీ కావడంతో ఇప్పటికీ కొనసాగుతోంది. కానీ ఈ ఏడాది మాత్రం ప్రవేశాలు నిలిపివేశారు.

గత ఏడాది నవంబర్‌లో బీసీఐ కమిటీ సందర్శన కోసం రూ. 8.50 లక్షలు వర్సిటీ డీడీ చెల్లించింది. కమిటీ సందర్శనకు రాలేదు. మరో పక్క ఆన్‌లైన్ సందర్శన చేస్తామని సమాచారం ఇచ్చారు. అయినా కమిటీ వర్చువల్ సందర్శన చేయలేదు. లా కోర్సులో గతంలో 80 సీట్లు ఉండేవి. ప్రస్తుతం విద్యా ప్రమాణాల కోసం 40కి కుదించారు. ఈడబ్ల్యూఎస్ కోటాతో కలిపి 44 సీట్లు నిర్వహిస్తున్నారు. ఉన్నత విద్యా మండలి దృష్టికి అధికారులు సమస్య తీసుకువెళ్లారు. బీసీఐ గుర్తింపు జాబితాలో లేని కారణంగా ప్రవేశాలు నిలిపివేసినట్లు ఉన్నత విద్యా మండలి స్పష్టం చేసింది. మరో పక్క బీసీఐ గుర్తింపు పత్రం అందజేస్తే ప్రవేశాలకు అనుమతిస్తామని తెలిపారు. బీసీఐ మాత్రం ధ్రువీకరణ పత్రం ఇచ్చేందుకు ముందుకు రావటం లేదు. ఉన్నత విద్యా మండలి అనుమతితో ప్రవేశాలు నిర్వహించాలని సూచిస్తోంది. దీంతో లా విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ప్రైవేట్ కళాశాలలకు అనుమతి..

2012 నుంచి శ్రీకాకుళం పట్టణంలోని ఎంపీఆర్ న్యాయ కళాశాలకు బీఆర్ఏయూ అనుబంధ కళాశాల గుర్తింపు ఇస్తోంది. అంతకు ముందు ఏయూ అనుబంధంగా ఉండేది. విశ్వ విద్యాలయంలోని పీజీ సెంటర్ సైతం ఏయూ అనుబంధంగా కొనసాగుతుండేది. ఎంపీఆర్ న్యాయ కళాశాలకు బీఆర్ఏయూ అఫిలియేషన్ మంజూరుతో పాటు పరీక్షల నిర్వహణ, ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేది. పరీక్షలు, వైవా వాయిస్‌లు సైతం వర్సిటీలో చేసేవారు. ఇప్పుడు ఎంపీఆర్ కళాశాలకు సంబంధించి గుర్తింపు ఎవరు మంజూరు చేస్తారు, పరీక్షలు ఎవరు నిర్వహిస్తారన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఏయూ పరీక్షలు నిర్వహిస్తుందా? గుర్తింపు బీఆర్ఏయూ మంజూరు చేసి పరీక్షలు నిర్వహిస్తుందా అన్నది అయోమయంగా ఉంది. మరో పక్క తక్షణ ప్రవేశాల అనుమతి కోసం వర్సిటీ అధికారులు ఉన్నత విద్యా మండలిని కోరుతున్నారు.

తీవ్రంగా ప్రయత్నించాం



వర్సిటీలో ప్రవేశాల కోసం తీవ్రంగా ప్రయత్నించాం. బీసీఐకి రూ. 8.50 లక్షల ఫీజు కూడా చెల్లించాం. వర్చువల్ సందర్శనకు సైతం అనుమతి కోరాం. ఉన్నత విద్యా మండలి అనుమతితో ప్రవేశాలు నిర్వహించాలని బీసీఐ చెప్పింది. బీసీఐ నుంచి అనుమతి ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలని ఉన్నత విద్యా మండలి కోరింది. ఇలా ప్రవేశాలు జరగలేదు. 2012 నుంచి వర్సిటీ ఎంపీఆర్ కళాశాలకు అఫిలియేషన్ మంజూరు చేస్తోంది. అలాంటిది ఏయూ అఫిలియేషన్ అంటూ ఎంపీఆర్‌లో ప్రవేశానికి అవకాశం ఇచ్చారు. వర్సిటీలో ప్రవేశాల కోసం ప్రయత్నిస్తున్నాం. బీసీఐ గుర్తింపు లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం.

– ప్రొఫెసర్ సీహెచ్‌ప రాజేంద్రప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

ఓటరూ మేలుకో..!

- నేడు జాతీయ ఓటర్ల దినోత్సవం
- జిల్లాలో 18,26,018 మంది ఓటర్లు



శ్రీకాకుళం పాతబస్టాండ్: జాతీయ ఓటర్ల దినోత్సవానికి జిల్లా సిద్ధమైంది. బుధవారం ఉదయం పది గంటలకు నగరంలోని బాపూజీ కళా మందిరంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ ఏడాది 'నతింగ్ లైక్ ఓటింగ్, ఐ ఓట్ ఫర్ షూర్' అనే నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నమోదు సమ్మరీకి సంబంధించి సవరించిన ఓటర్ల జాబితా సిద్ధమైంది. దీని ప్రకారం జిల్లాలో 18,26,018 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో పురుషులు 9,09,559 మంది కాగా, స్త్రీలు 9,16,257 మంది, ఇతరులు 202 మంది ఉన్నారు. ఈ సమ్మరీలో 18, 19 సంవత్సరాల వారు జిల్లాలో 16,003 మంది కొత్తగా నమోదయ్యారు.

వయస్సుల వారీగా ఓటర్లు

18 -19 సంవత్సరాలు వయస్సు వారు	16,003
20-29	2,92,141
30-39	4,95,360
40-49	3,86,746
50-59	2,99,578
60-69	1,97,182
70-79	1,04,069
80 ఆ పై వయస్సువారు	34,939

నియోజకవర్గాల వారీగా..

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
ఇచ్ఛాపురం	127127	132564	21	259712
పలాస	103350	106785	42	210177
టెక్కలి	117860	116728	18	234606
పాతపట్నం	112588	112060	17	224665
శ్రీకాకుళం	130814	132181	39	263024
ఆమదాలవలస	94246	95038	23	189307
ఎచ్చెర్ల	120467	117507	25	237999
నరసన్నపేట	103107	103394	17	206518
మొత్తం	909559	916257	202	1826018

నియోజవర్గాల వారీగా కొత్త ఓటర్లు

ఇచ్ఛాపురం	2337
పలాస	1443
టెక్కలి	2849
పాతపట్నం	1855
శ్రీకాకుళం	2325
ఆమదాలవలస	1404
ఎచ్చెర్ల	1896
నరసన్నపేట	1894
మొత్తం	16003

ఉద్దానంలో తెగుళ్లపై అప్రమత్తత




జీడిపూతను చూపిస్తున్న డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ మెంబరు బత్తిని లక్ష్మణ్

మందస: ఉద్దానం రైతులు కొబ్బరి, జీడి పంటలపై అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్దాన వన యూనివర్సిటీ మెంబరు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు బత్తిని లక్ష్మణ్ కోరారు. ఇటీవల ఉద్దానంలో ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ సంస్థ నిపుణులు పర్యటించారు. టెక్నీషియన్లు గుర్తించిన తెగుళ్ల గురించి లక్ష్మణ్‌కు వివరించారు. దీంతో ఆయన మంగళవారం ఉద్దానం తోటల్లో పర్యటించి తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు.

పంటలకు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. లమిడాసైలాత్రిన్ 2.5 సీసీ 250 మిల్లీలీటర్లు, అగ్రిప్రో 250 గ్రాములు, జింక్‌మాగ్ 250 మిల్లీలీటర్లు 200 లీటర్లు ఉన్న పెద్ద డ్రమ్ములో ఈ మూడు రసాయనాలను వేసి, బాగా కలపాలన్నారు. ఈ రసాయనాన్ని జీడిపంటకు స్ప్రే చేయాలని సూచించారు. పూత రావడానికి ముందు, పూత వచ్చిన అనంతరం కూడా రెండు సార్లు స్ప్రే చేయాలన్నారు. ప్రస్తుతం ఈ విధానం ఉద్దానం రైతులకు ఉపయోగపడుతుందన్నారు. ఇతర తెగుళ్లు రాకుండా కాపాడుతుందన్నారు. ఏరీస్ ఆగ్రో సంస్థ సీనియర్ మేనేజరు కె.కృష్ణారావు, ఎక్స్‌టెన్షన్ అధికారి జి.రాజా సూచనల మేరకు రైతులు ఈ పద్ధతులు పాటించాలన్నారు. పలాస, హరిపురం, సోంపేట ప్రాంతాల్లో ఈ మందులు లభ్యమవుతాయని పేర్కొన్నారు. రైతుల సందేహాలను సంస్థ ప్రతినిధులు నివృత్తి చేశారని తెలిపారు. ఆయనతో పాటు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు జుత్తు నారాయణ రావు, గుంటు లింగరాజు, జుత్తు పాపారావు, బత్తిని మాధవరావు, రైతులు బత్తిని ఉమాపతి, పూజారి కామయ్య, తాడాల అప్పలస్వామి తదితరులు పాల్గొన్నారు.

'ఎగ్'స్ట్రా కేర్ తీసుకోవాల్సిందే..!

- పర్యవేక్షణ లేక పాడైపోతున్న అంగన్‌వాడీ గుడ్లు
- ఇరుకు గదుల్లో నిల్వ



గుడ్లు నిల్వ చేస్తున్న రేకుల షెడ్డు

కోటబొమ్మాళి: ప్రభుత్వం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న గుడ్లను పలు చోట్ల సక్రమంగా నిల్వ చేయడం లేదు. ఫలితంగా పలు చోట్ల గుడ్లు పాడైపోయి ప్రభుత్వానికే నష్టం వాటిల్లుతోంది. ప్రతి నెలా జిల్లా నుంచి కోటబొమ్మాళి అంగన్‌వాడీ ప్రాజెక్ట్ కార్యాలయం పరిధిలోని 218 అంగన్‌వాడీ కేంద్రాలకు, అలాగే టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, జలుమూరు మండలాల పరిధిలోని 506 ప్రభుత్వ పాఠశాలకు గుడ్ల సరఫరా జరుగుతోంది. అయితే ఇక్కడ కాంట్రాక్టర్ నుంచి కోటబొమ్మాళికి చెందిన ఒక వ్యక్తి అనధికారికంగా ఈ గుడ్ల సరఫరా బాధ్యతను తీసుకున్నారు. శ్రీకాకుళం నుంచి వస్తున్న గుడ్లను స్థానికంగా ఇరుకైన ఒక రేకుల షెడ్డులో నిల్వ ఉంచుతూ ఆ తర్వాత అంగన్‌వాడీలు, పాఠశాలలకు సరఫరా చేస్తున్నారు. అయితే రేకుల షెడ్డులో నిల్వ ఉంచుతుండడంతో చాలా వరకు గుడ్లు పాడైపోతున్నాయి. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. పర్యవేక్షణ లేకపోవడం వల్లే గుడ్లు పాడైపోయి నష్టం వస్తోందని వారంటున్నారు. ఈ విషయమై స్థానిక అంగన్‌వాడీ ఇన్‌చార్జి పీఓ వై.లావణ్య వద్ద ప్రస్తావించగా రేకు షెడ్డులో గుడ్లు నిల్వ ఉంచడం వాస్తవమేనని, అంగన్‌వాడీ పీడీ దృష్టికి తీసుకువెళ్లి భవనం మార్పు చేయిస్తామన్నారు. డీఈఓ దృష్టికి కూడా తీసుకెళ్తామని స్థానిక ఎంఈఓ గోవింద తెలిపారు.

మొక్కజొన్న పంట పరిశీలన



కేశవరాయునిపురంలో మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న ఫారెస్టు డిప్యూటీ రేంజర్ అప్పలనాయుడు

లావేరు: మండలంలోని కేశవరాయునిపురం, జీజీ వలస, లావేటిపాలేం గ్రామాల్లో మంగళవారం ఫారెస్టు అధికారులు పర్యటించి అడవి పందులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. మండలంలోని జీజీ వలస, కేశవరాయునిపురం, లావేటిపాలేం గ్రామాల్లో రైతులు సాగు చేస్తున్న మొక్కజొన్న పంటను రాత్రి సమయాల్లో అడవి పందులు వచ్చి ధ్వంసం చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై సాక్షిలో వార్తా కథనం ప్రచురితం కావడంతో ఫారెస్టు ఉన్నతాధికారులు స్పందించారు. మంగళవారం ఫారెస్టు డిప్యూటీ రేంజర్ ఆర్.అప్పలనాయుడు, బీట్ ఆఫీసర్ ఎస్. శ్రీనివాసరావు మండలంలోని కేశవరాయునిపురం, జీజీ వలస, లావేటిపాలేం గ్రామాల్లో పర్యటించి అడవి పందులు ధ్వంసం చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించారు. అడవి పందుల బెడద లేకుండా చేయాలని, పాడు చేసిన పంటకు నష్టపరిహారం వచ్చేలా చేయాలని రైతులు ఫారెస్టు అధికారులను కోరారు.

రిపబ్లిక్ డే వేడుకలకు సంధ్యశ్రీ ఎంపిక



శ్రీకాకుళం కల్చరల్: స్థానిక ప్రభుత్వ మహిళా కళాశాలలో చదువుతున్న ముప్పవరపు సంధ్యశ్రీ ప్రతీక ఢిల్లీలోని గణతంత్ర వేడుకల్లో పాల్గొననుందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీరాములు తెలిపారు. ఆమె భరతనాట్యం ప్రదర్శనలో పాల్గొంటుందని, జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రం తరపున ఎంపికైందని పేర్కొన్నారు.

పట్టపగలు ఇంట్లో చోరీ

టెక్కలి రూరల్: స్థానిక కొప్పల అప్పన్న నగర్‌లోని ఓ ఇంటిలో మంగళవారం పట్ట పగలే దొంగతనం జరిగింది. ఈ ప్రాంతంలో మల్ల రాంబాబు అతని భార్య భాగ్యలక్ష్మి, కుమారుడు సుకేష్‌తో కలసి నివాసముంటున్నారు. రాంబాబు అతని భార్య రెండు రోజుల కిందట హైదరాబాద్ వెళ్లారు. అప్పటి నుంచి సుకేష్ ఒక్కడే ఇంటిలో ఉంటున్నాడు. మంగళవారం ఉదయం 7 గంటలకు సుకేష్ పనిమీద బయటకు వెళ్లాడు. తిరిగి 10 గంటల సమయంలో వచ్చిచూసే సరికి తలుపు తాళాలు బద్దలుగొట్టి ఉన్నాయి. లోపలకు వెళ్లి చూస్తే బీరువా తెరిచి ఉంది. అందులో కొంత నగదు, ఆరు వెండి ప్లేట్లు, ఆరు గ్లాసులు, 500 గ్రాముల కంచం దొంగిలించారని సుకేష్ చెబుతున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న టెక్కలి ఎస్‌ఐ రామకృష్ణ ఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. అనంతరం క్లూస్ టీమ్ ఆధారంగా తనిఖీలు చేపట్టారు. సుకేష్ తల్లిదండ్రులు ఇంటికి వస్తే ఏమేం పోయాయో పూర్తిగా తెలుస్తుందని అన్నారు.

ఫిబ్రవరి 1న శాలిహుండం గిరి యాత్ర



గోడ పత్రికను విడుదల చేస్తున్న ఎంపీపీ రఘురామ్, ధర్మకర్త సుగ్గు మధురెడ్డి

గార: శాలిహుండం వేణుగోపాలస్వామి గిరి యాత్ర ఫిబ్రవరి 1వ తేదీ భీష్మ ఏకాదశి సందర్భంగా నిర్వహిస్తున్నామని ఎంపీపీ గొండు రఘురాం, ఆలయ వంశపారంపర్య ధర్మకర్త సుగ్గు మధురెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం వారు ఆలయంలో కరపత్రికలు విడుదల చేశారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు స్వామి ఉత్సవాలు జరుగుతాయన్నారు. 31వ తేదీ మంగళవారం సాయంత్రం స్వామి తిరువీధి ఉత్సవం జరుగుతుందన్నారు. అర్ధరాత్రి 12 గంటల తర్వాత నిజరూప దర్శనం, వేకువన క్షీరాభిషేకం, అనంతరం రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలుని ఉత్సవమూర్తులకు సమీప వంశధార నదిలో చక్రతీర్థ స్నానాలు, అనంతరం స్వామి దర్శనాలు ఉంటాయని తెలిపారు. 5వ తేదీ పౌర్ణమి నాడు స్వామి తిరుక్కల్యాణ మహోత్సవం, పుష్పయాగం జరుగుతుందన్నారు. భక్తుల కోసం అన్ని శాఖల అధికారుల సహకారంతో ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ ప్రతినిధి అరవల రామకృష్ణ, సర్పంచ్‌లు మార్పు పృథ్వీరాజ్, గుండ భాస్కరరావు, కొంక్యాణ ఆదినారాయణ, గొల్లంగి వెంకటేశ్వర్లు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి, పీస గోపి. కొయ్యాణ నాగభూషణం, జల్లు గౌరపతినాయుడు, శిమ్మ ధర్మరాజు, చింతల గడ్డెయ్య పాల్గొన్నారు.

వివక్ష లేని సమాజం కావాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు



మాట్లాడుతున్న కార్యదర్శి సన్యాసినాయుడు

అరసవల్లి: బాలికలపై వివక్ష లేని సమాజం కావాలని, ఇందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు పిలుపునిచ్చారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికల విద్యతోనే సమాజంలో నూతన మార్పు సాధ్యమవుతుందని, ఇందుకు జిల్లాలో ప్రతి ఆడబిడ్డ విద్యను అభ్యసించాలని సూచించారు. మగవారితో పాటు ఆడపిల్లలకు కూడా ఆస్తిలో సమాన హక్కు ఉంటుందని, అలాగే వరకట్న, లైంగిక వేధింపులు, గృహహింస నిరోధక చట్టాలు మహిళల కోసం అమలవుతున్నాయన్నారు. ఇన్ని చట్టాలున్నప్పటికీ చాలా చోట్ల బాల్యవివాహాలు, భ్రూణ హత్యలు జరుగుతున్నాయని ఇది ఆందోళనకరమైన అంశమన్నారు. అలాగే గర్భస్థ శిశులింగ నిర్ధారణ నేరమని, బాలికలపై ఈ వివక్ష లేకుండా సమాజంలో చైతన్యం తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. రిటైర్డ్ న్యాయమూర్తి పప్పల జగన్నాథరావు మాట్లాడుతూ సమాజంలో బాలికలపై చిన్నచూపు పనికిరాదని, ఇప్పుడు చాలా రంగాల్లో మహిళలే కీలక స్థానాల్లో ఉన్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓ డాక్టర్ అనూరాధ, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ భాస్కరరావు, ఆరోగ్యశ్రీ సమన్వయ కర్త ప్రకాశరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ లక్ష్మి తులసి, జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు



రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో తలపడుతున్న శ్రీకాకుళం-నెల్లూరు బాలికల జట్టు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు గ్రామంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-17 రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలు మంగళవారం హోరాహోరీగా జరిగాయి. 13 ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన నిర్వహించిన ఈ పోటీల్లో బాలుర విభాగం నుంచి 13 జట్లు, బాలికల విభాగం నుంచి 13 జట్లు పాల్గొంటున్నాయి. మంగళవారం జరిగిన ఈ పోటీల్లో బాలికల విభాగంలో విజయనగరం-కృష్ణా జిల్లాల జట్ల మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 61-25 పాయింట్ల తేడాతో విజయనగరం జట్టు గెలుపొంది సెమీస్‌కు చేరుకుంది. శ్రీకాకుళం-నెల్లూరు మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 32-15 పాయింట్ల తేడాతో శ్రీకాకుళం బాలికల జట్టు గెలుపొంది సెమీస్‌కు చేరింది. అలాగే బాలుర విభా గంలో విశాఖపట్నం-చిత్తూరు జిల్లాల మధ్య జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 44-18 పాయింట్ల తేడాతో విశాఖపట్నం జట్టు విజయం సాధించి సెమీస్‌కు చేరుకుంది. శ్రీకాకుళం-నెల్లూరు జట్ల నడుమ జరిగిన క్వార్టర్ ఫైనల్స్‌లో 50-19 శ్రీకాకుళం బాలుర జట్టు సెమీస్‌కు చేరుకుంది. ఫ్లడ్ లైట్ల వెలుగులో మిగతా జట్ల మధ్య పోటీలు సాగాయి. సెమీ ఫైనల్స్‌కు చేరుకున్న ఎనిమిది బాల, బాలికల జట్లకు బుధవారం ఉదయం 9గంటల నుంచి పోటీలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు. వైస్ ఎంపీపీ సారిక వైకుంఠం నాయుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు పోటీలను పర్యవేక్షించారు.

సెంచూరియన్‌తో గబాన్ ప్రభుత్వం ఒప్పందం



ఎంవోయూ పత్రాలు మార్చుకుంటున్న వర్సిటీ, గబాన్ ప్రభుత్వం ప్రతినిధులు

పర్లాకిమిడి: స్థానిక ఆర్.సీతాపురం సెంచూరియన్ వర్సిటీ ఆఫ్రికా దేశంలోని గబాన్ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు వర్సిటీ మెయిన్ క్యాంపస్ బోర్డు రూములో మంగళవారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఏటీఎం గ్లోబల్ దక్షిణాఫ్రికా, రాజేష్ పారిక్‌తో ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఒప్పందం ప్రకారం గబాన్‌లో సెజ్‌లోని 500 హెక్టార్లలో ఐదేళ్ల పాటు ప్లాంటేషన్, పండ్ల తోటల పెంపకం, రాగులు, మొక్కజొన్న, అల్లం, మిరియాలు పండించడమే కాకుండా, కోల్డ్ స్టోరేజీ నిర్మాణాలు, శాటిలైట్ సిస్టం నిర్మిస్తామని వెల్లడించారు. గబాన్ దేశంలో రానున్న రోజుల్లో మెరైన్ ఇంజినీరింగ్, స్కిల్ డవలప్‌మెంట్, సివిల్ ఇంజినీరింగ్ రంగాల్లో సెంచూరియన్ వర్సిటీ సేవలను విస్తరించనున్నట్లు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య డి.ఎన్.రావు పేర్కొన్నారు. గతేడాది ఫిబ్రవరిలో పీఎం నరేంద్రమోదీ ఆఫ్రికాలో మొరాకో, గబాన్‌లో పర్యటించారు. అలాగే ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, ఇతర ప్రతినిధులు ప్రైవేటు వర్సిటీలు సందర్శించిన సమయంలో ఇండియా-ఆఫ్రికా దేశాల ఒప్పందం జరిగింది. ఆ మేరకు ఒడిశా రాష్ట్రంలోని సెంచూరియన్ వర్సిటీ మెయిన్ క్యాంపస్‌ను ఈ ఏడాది ఫిబ్రవరిలో గబాన్ విదేశాంగ రాయబారి సందర్శించనున్నట్టు ఆచార్య డి.ఎన్.రావు వెల్లడించారు. ఈ ఒప్పందం ప్రకారం వంద మిలియన్ల పెట్టుబడులు సెంచూరియన్ మ్యానేజ్‌మెంట్ ఆఫ్రికా దేశంలోని గబాన్‌లో పెట్టనున్నట్టు వివరించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇక్కడి ఎం.ఎస్.స్వామి నాథన్ అగ్రికల్చర్ స్కూల్‌కి చెందిన ఉత్తమ విద్యార్థులు, ఐదుగురు ఫ్యాకల్టీని గబాన్‌కు పంపించనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో సీఈవో అమిత్ దుల్హానీ, సెంచూరియన్ వర్సిటీ వైస్ ఛాన్సలర్ సుప్రియా పట్నాయిక్, వర్సిటీ రిజిస్ట్రార్ డా.అనితా పాత్రో, వ్యవసాయ విద్యాలయం డీన్ డా.ఎస్.పి.నందా, డా.మోనాలిసా ఘోష్, డా.సుబ్బారావు, డా.జె.అనిల్‌కుమార్, డా.దుర్గాప్రసాద్ పాఢి తదితరులు పాల్గొన్నారు.